## క్లుప్తంగా

### ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

సదుం: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిమ్మానాయనపల్లె పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేయడంతో వారి సమక్షంలో జెడ్పీ సీఈఓ విచారణ చేశారని ఎంపీడీఓ హరిబాబు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### మోటార్ సైకిళ్లు ఢీ ఒకరికి గాయాలు

పుంగనూరు: ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఒకరు గాయపడిన సంఘటన మంగళవారం పట్టణ సమీపంలోని బాలాజి థియేటర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. మండలంలోని ఏటవాకిలికి చెందిన శ్రీరాములు(45) ద్విచక్రవాహనంపై పట్టణంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీరాములును 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



రోగి కళ్లను పరీక్షిస్తున్న వైద్యాధికారి ఆక్విల్

బైరెడ్డిపల్లి: మొగసాల ట్రస్ట్ సౌజన్యంతో అగస్త్రీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మంగళవారం బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 35 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 10 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యాధికారి ఆక్విల్ మాట్లాడుతూ, పేద ప్రజలకు ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని, కంటి వైద్య నిపుణుల సలహాల మేరకు కళ్లలో ఉచిత లెన్స్ అమర్చుతామని చెప్పారు. రోగులకు భోజన వసతి, ప్రయాణపు ఖర్చులు కూడా భరిస్తామన్నారు.

### మంచి విద్యనివ్వడమే శిక్షణ లక్ష్యం

పలమనేరు: ప్రపంచ బ్యాంకు నిధులతో సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్)లో భాగంగా అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి పేరిట శిక్షణనిచ్చి వారికి సర్టిఫికెట్లను ఇచ్చే కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, ఈ శిక్షణ ఏడాదిలో రెండు విడతలుగా 120 రోజుల పాటు ఉంటుందన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు ప్రాథమిక దశ నుంచే మంచి విద్యనందించడమే శిక్షణ లక్ష్యమన్నారు. రిసోర్స్ పర్సన్లు నాగరాజు, చందు, ప్రియదర్శిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఎంఆర్‌టీలు పాల్గొన్నారు.

### నియామకం



దొరస్వామి

పెద్దపంజాణి: పలమనేరు నియోజకవర్గం వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడిగా మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ నడింపల్లెకు చెందిన యం.దొరస్వామి నియమితులయ్యారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు నుంచి నియామక పత్రాన్ని మంగళవారం అందుకున్నట్లు ఆయన తెలిపారు. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

### చింత చెట్టు నుంచి పడి కూలీకి తీవ్రగాయాలు



శ్రీరాములును ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: చింతచెట్టు నుంచి పడి కూలీకి తీవ్రగాయాలైన సంఘటన కుప్పం మండలం సలార్లపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలో చింతకాయలు రాల్చేందుకు తమిళనాడు రాష్ట్రం ఏకలనత్తం నుంచి శ్రీరాములు వచ్చాడు. ప్రమాదవశాత్తు చెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కూలీలు హుటాహుటిన అతడిని కుప్పంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు., శ్రీరాములు ఎడమ కాలు విరిగినట్లు వైద్యులు చెప్పారు.

# గంగమ్మ కుర్చీ ఎవరికో..?

- జాతర సమీపిస్తున్నా జాడలేని కమిటీ నియామకం
- చైర్మన్ రేసులో పలువురు అభ్యర్థులు
- జనసేన, టీడీపీ నేతల మధ్య పోటీ
- ఎటూ తేల్చని ప్రభుత్వం
- అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు



కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం

కుప్పం: మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన కుప్పంలో ప్రాముఖ్యత సంతరించుకున్న శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవం సమీపిస్తున్నా ఆలయ కమిటీ నియామకం ఊసే లేకపోవడంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. వాస్తవానికి ఇప్పటికే అమ్మవారి జాతర ఏర్పాట్లు, ప్రచారంపై చర్చించాల్సి ఉంది. అయితే కమిటీని నియమించకపోవడంతో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి జాతర నిర్వహణ ఎలా ఉంటుందోనని భక్తుల్లో చర్చకు తావిస్తోంది.

**ఎందుకో ఇంత జాప్యం?**

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ కమిటీ నియామకంపై మహా కూటమి ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. మే 5 నుంచి 24వ తేదీ వరకు శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర ప్రతి ఏటా నిర్వహించడం పరిపాటి. కానీ కమిటీ నియామకం జరగకపోవడంతో జాతర నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం ఆలయ కమిటీ చైర్మన్‌గా బీఎంకె.రవిచంద్రబాబు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. కానీ మహా కూటమిలో భాగమైన జనసేన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని చైర్మన్ పదవి తమకే కేటాయించాలని పట్టుపడుతోంది. కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నరేష్ గంగమ్మ గుడి చైర్మన్‌పై ఆశలు పెట్టుకున్నారు. అలాగే, గతంలో చైర్మన్ పదవి అనుభవించిన వారు సైతం పోటీ పడుతుండడంతో రాజకీయం రసకందాయంలో పడింది. అన్నా క్యాంటీన్ నిర్వహణ పర్యవేక్షిస్తున్న బీఎంకె. రవిచంద్రబాబుకు ఇవ్వాలని ఎన్నికల సమయంలోనే నిర్ణయించారు. మహా కూటమి అధికారంలోకి వచ్చిన మరికొందరు సైతం పదవి రేసులోకి రావడంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. దీంతో అధికార పార్టీ రవిచంద్రబాబును ప్రకటించకపోవడంలో జాప్యం చేస్తుండడంతో ఒకింత ఉత్కంఠ పెరిగింది. గంగమ్మ గుడి చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో అని ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు!

**కానరాని ఏర్పాట్లు**

ప్రతి ఏటా మే 5వ తేదీన జాతర చాటింపు ప్రారంభించి 24వ తేదీ అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుంది. ఈ జాతర కర్ణాటక, తమిళనాడుతో పాటు ఉమ్మడి జిల్లాల్లో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. వీటి ఏర్పాట్ల కోసం మూడు నెలల ముందే పనులు ప్రారంభిస్తారు. 15 రోజుల పాటు జరిగే జాతరలో సాంస్కృతిక, సాంప్రదాయ కార్యక్రమాల నిర్వహణకు ఫిబ్రవరి నుంచే ఏర్పాట్లు మొదలు పెడతారు. అంతేకాకుండా అమ్మవారికి విరాళమిచ్చే దాతలకు ముందస్తుగా కరపత్రాలు పంపించి సమాచారం ఇవ్వాలి. అయితే కమిటీ నియామకం లేకపోవడంతో ఇప్పటివరకు ఈ దిశగా చర్యలేవీ లేకపోవడంతో జాతర నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారా? కమిటీని నియమించి నిర్వహిస్తారా? అనే ప్రశ్నలు భక్తుల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఈ జాతరకు తమిళనాడులోని క్రిష్ణగిరి, తిరుపత్తూరు, సేలం జిల్లాలు, కర్ణాటక రాష్ట్రంలోని కోలారు, బెంగళూరు, హొసూరు ప్రాంతాల నుంచి భారీ ఎత్తున భక్తులు రావడం పరిపాటి. ఇప్పటికే భక్తులు జాతరపై ఆసక్తితో ఎదురు చూస్తున్నా మహాకూటమి మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందనే విమర్శలొస్తున్నాయి.

## ఆన్‌లైన్ నమోదులో తప్పిదాలు చేస్తే చర్యలు

- రెవెన్యూ ఉద్యోగులకు ఆర్డీఓ హెచ్చరిక
- భూ సమస్యల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం



భూ సమస్యలపై వీఆర్వోలతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఆన్‌లైన్‌లో భూముల వివరాలను నిక్షిప్తం చేయడంలో ఎలాంటి తప్పిదాలు చేసినా ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. భూ సమస్యలపై మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో సమస్యలపై మొత్తం 186 ఫిర్యాదుల వచ్చాయని, వాటిలో85 సమస్యలను ఇప్పటివరకు పరిష్కరించాని, మిగిలిన సమస్యలను కూడా విచారణ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓకు తహసీల్దార్ కిరణ్‌కుమార్ నివేదించారు. దీనిపై ఆయన పైవిధంగా ప్రతిస్పందించారు. 6 నెలల కాలంలో ఎన్ని సమస్యలు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కాని సమస్యల రికార్డులను ఆర్డీఓ పరిశీలించారు. సమస్యలపై చర్చించి వారి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో డీటీ లోకేష్, ఏఎస్ఓ రాజేశ్వరి, వీఆర్వోలు ముబారక్, పల్లవి, మహేష్, శ్రీనివాసులు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

### వినతులపై అలసత్వం వద్దు



సమీక్షిస్తున్న ఆర్డీఓ భవాని

సదుం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల పరిష్కారంలో అలసత్వం వహించరాదని ఆర్డీఓ భవాని అన్నారు. భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందిన వినతుల పరిష్కారంపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 181 ఫిర్యాదులు అందగా, 68 ఫిర్యాదులు పరిష్కరించినట్లు అధికారులు ఆమెకు చెప్పారు. మిగిలిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, డీటీ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

### శిక్షణతో మంచి విద్యాబోధన



శిక్షణ ఇస్తున్న లక్ష్మయ్య

గుడుపల్లె: అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణతో మంచి విద్యాబోధన చేయాలని, పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని ఎంపీడీఓ రాధాక్రిష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఎంఈఓ లక్ష్మయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

### ఒత్తిడిలేని విద్య బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్రమణ్యం

బైరెడ్డిపల్లె: పిల్లలకు ఒత్తిడిలేని విద్యను బోధించాలని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆట, పాట, మాటల ద్వారా ప్రాథమిక స్థాయిలో బోధన చేయడానికి కృషి చేయాలన్నారు. పిల్లల అభ్యసనలో తల్లిదండ్రులను భాగస్వామ్యుల్ని చేసి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేసి వాటి ద్వారా పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించాలన్నారు. రిసోర్స్ పర్సన్లు శశికుమార్, మోహన్, రాజశేఖర్, రాజేష్, సుజాత, రమాదేవి పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం



చెత్తాచెదారం తొలగిస్తున్న వలంటీర్లు

గుడుపల్లె: ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను కూడ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు కోరారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. శ్రమదానం చేసి పొదలు, చెత్తాచెదారం తొలగించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రామాపురంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పద్మావతి

బైరెడ్డిపల్లె: రుగ్మతల బారిన ప్రజలు తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి కోరారు. మండలంలోని రామాపురంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, జలుబు, జ్వరం, దీర్ఘకాలిక వ్యాధులపై ఆమె అవగాహన కల్పించారు.. గుండెపోటు, క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని పురుషులకు హితవు పలికారు. గర్భవతులు ప్రభుత్వాసుపత్రుల్లోనే కాన్పులు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతోనే శారీరక దారుఢ్యం



పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థినులు

కుప్పం రూరల్: క్రీడలతోనే శారీరక దారుఢ్యం సాధ్యమని కొత్తయిండ్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో వార్షిక క్రీడలు నిర్వహించారు. విద్యార్థులకు పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ, క్రీడలతో ఏకాగ్రత, పట్టుదల, నాయకత్వ లక్షణాలు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుడు లోకనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వర్కర్లకు 'జ్ఞాన జ్యోతి' శిక్షణ



పుంగనూరు: మాట్లాడుతున్న ఎంఈఓ

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు 'జ్ఞానజ్యోతి' పేరిట ఆరు రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సర్వశిక్ష అభియాన్ అధికారి ఇంద్రాణి, ఏఎస్ఓ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, ఐసీడీఎస్ పీవో రాజేశ్వరి మాట్లాడారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శిక్షణకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ప్రాథమిక స్థాయిలో భాషాభివృద్ధి కోసం కృత్యాలు ఎలా వినియోగించాలి? అలాగే ఆధారిత కృత్యాలు ఎలా అర్థం చేసుకోవాలి? అనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై రిసోర్స్ పర్సన్లు సమగ్ర శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు వసుంధర, సుబ్రమణ్యం, వెంకట్రమణారెడ్డి, ప్రసాద్, సర్వేష్, సుగుణ , కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

**పులిచెర్లలో..**

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల హైస్కూలు, ఎంపీపీ స్కూల్లో ఎంపీడీఓ రాజశేఖర బాబు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పులిచెర్ల ఐసీడీఎస్ పరిధిలోని 57 కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య,హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్‌వలీ,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులిచెర్ల ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు

**శిక్షణ ప్రారంభం**

సదుం: అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం మండలంలో మంగళవారం ప్రారంభించినట్లు ఎంఈఓ–1 సిద్ధరామయ్య, ఎంఈఓ–2 దామోదర తెలిపారు. సదుం జెడ్పీ హైస్కూల్లో 26 మందికి, బూరగమందలో 27 మందికి ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు.. హెచ్‌ఎంలు జయకుమార్ రెడ్డి, సుమతమ్మ, సూపర్‌వైజర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## కూటమి గుడ్డి ప్రభుత్వం

- నెలన్నర రోజులుగా ఆందోళన చేస్తున్నా స్పందించని వైనం
- కళ్లకు గంతలు కట్టుకుని రైతుల వినూత్న నిరసన

కుప్పం రూరల్: నెలన్నర రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులుగానీ, ప్రభుత్వం పట్టించుకోకుండా గుడ్డిగా వ్యవహరిస్తోందని రైతులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మండలం ఆవులనత్తం జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళన మంగళవారం 44వ రోజుకు చేరింది. జెల్లి ఫ్యాక్టరీ వల్ల తమ బతుకులు బుగ్గి అవుతున్నాయని ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వంలో కదలిక లేకపోవడం శోచనీయమన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము వల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని, శబ్దాలతో రాత్రుల్లో నిద్ర పట్టడం లేదని, ఫ్యాక్టరీ చుట్టు పక్కల భూములు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చుట్టు పక్కల ఇళ్లు బీటలు బారాయని, కుప్పానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇకనైనా సమస్యపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

## కార్మికుల ఐకత్యతోనే సమస్యల సాధన



మాట్లాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య

పలమనేరు: కార్మికులు ఐక్యమత్యంతో సమస్యల సాధనకు కృషి చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య అన్నారు. పలమనేరు సమీపంలోని ఓ హోటల్ వద్ద మంగళవారం ఆ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాధం, బలరామమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. అధికారుల వేధింపులు, కేసులున్న వారిపై ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజశేఖర్, స్థానిక డిపో గౌరవాధ్యక్షులు సుధీర్‌కుమార్, జోనల్ కమిటీ సభ్యులు, ఐదు డిపోల నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత



శిక్షణ తరగతులలో ప్రసంగిస్తున్న ఎంఈఓ

రొంపిచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యాబోధనకు ప్రాధాన్యతనిచ్చి ఆ దిశగా లక్ష్య సాధనకు కృషి చేయాలని ఎంఈఓ ఇందిర అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో అంగన్‌వాడీలకు ఆరు రోజుల శిక్షణ మొదలైంది. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లోను చదవడం, రాయడం, అంకెలను నేర్చుకునేలా బోధన చేయాలన్నారు. పాఠశాలకు వచ్చే పిల్లలు శారీరక, మానసిక వికాసంతో ఉండేలా చూడాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు ఆటపాటలు, శరీరక కదలికల ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, బీఆర్‌పీలు ఎల్లప్ప, మనోహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సీఆర్‌పీలు అన్నసూయ రాజేంద్ర, కిరణ్, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల బాధ్యతే కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశులు

పలమనేరు: పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల బాధ్యతే కీలకమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పిల్లల ఆలోచన, వారి ప్రవర్తన ఎలా ఉందో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలపై మమకారంతో రేస్ బైక్‌లు, ఖరీదైన మొబైళ్లు కాకుండా మర్యాద, గౌరవం, సాంప్రదాయాలను నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలు చెడు మార్గాల్లో పయనించకుండా ఒకింత కన్నేసి ఉంచాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 26న కంగుందిలో కబడ్డీ పోటీలు

కుప్పం రూరల్: శివరాత్రి పురస్కరించుకుని కంగుందిలో ఈ నెల 26న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ.50వేలు, రూ.35 వేలు, మూడవ స్థానం జట్టుకు రూ.20వేలు, 4వ స్థానం జట్టుకు రూ.10వేలు, 5వ స్థానం జట్టుకు రూ.7వేలతో పాటు ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.2000 అని చెప్పారు. సంప్రదించాల్సిన నిర్వాహకుల సెల్ నంబర్లు 70133 72809 (నాగరాజు), 9603225844 (రాజేంద్ర).

## ఫార్మర్ ఐడీ ఉంటేనే పథకాలకు అర్హత



సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్



శాంతిపురం: బెళ్లకోగిలలో నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అప్పోజి

**–పుంగనూరు ఏడీఏ శివకుమార్**

గంగవరం: భూములు కలిగిన రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ కలిగి ఉండాలని, ఇందుకోసం భూమి తాలూకు జెరాక్సులను ఆయా రైతులు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో అందజేసి ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ పుంగనూరు ఏడీఏ శివకుమార్ కోరారు. మంగళవారం మండలంలోని మేలుమాయిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఆధార్ ఎలాగో రైతుకు ఫార్మర్ ఐడీ అలాంటిదేనని, దీనిని కలిగి ఉంటేనే వ్యవసాయానికి సంబంధించిన పథకాల ఫలాలు అందుకోగలుతారని చెప్పారు. ఇప్పటివరకు మండలంలో 4,320 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన రైతులు ఈ నెలాఖరులోపు చేసుకోవాలని కోరారు. ఇక, పంటల సాగులో సరైన సస్యరక్షణ విధానాలు పాటించాలని, అవసరమైనంత వరకే మందులను పిచికారీ చేసి వేసవిలో అన్ని పంటలకు ఎక్కువ శాతం తడి ఉండేలా కాపాడుకోగలిగితే రాబడి బాగుంటుందన్నారు. అనంతరం సాగులో ఉన్న పలు పంటలను ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారిణి హేమలత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**శాంతిపురంలో..**

శాంతిపురం: మండలంలోని రైతులందరూ ఈ నెల 25లోపు 'రైతు రిజిస్ట్రీ'లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. మంగళవారం ఆయన పలు రైతు సేవా కేంద్రాలను సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండలంలో మొత్తం 8,250 మంది రైతులు ఉండగా వారిలో 2,670 మంది మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ చేసిన ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్, ఇతర రాయితీలు, పథకాలు అందుతాయని చెప్పారు.